సాక్షి ప్రకాశం

శనివారం । 11 । ఫిబ్రవరి । 2023



ట్రాక్టర్ తిరగబడి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దుర్మరణం

ట్రాక్టర్ తిరగబడి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దుర్మరణం చెందాడు. - 8లో..



పుల్లలచెరువు ప్రాంతంలో పులి సంచారం

పుల్లలచెరువు మండలంలో పలు చోట్ల పులి సంచారం కలకలం సృష్టించింది. - 8లో..

గరిష్టం/కనిష్టం
32 /20

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వాతావరణం పొడిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

స్పందన రద్దు

ఒంగోలు అర్బన్: ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎంఎల్‌సీ ఎన్నికల దృష్ట్యా జిల్లాలో స్పందన కార్యక్రమాలను నిలిపివేస్తున్నట్లు కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు స్పందన ఉండదన్నారు. సుదూర ప్రాంతాల నుంచి ప్రతి సోమవారం జిల్లా కేంద్రానికి వచ్చే ప్రజలు ఈ మార్పును గమనించాలని ఆయన సూచించారు.

జిల్లా వైద్యశాలలో 28 సీసీ కెమెరాల ఏర్పాటు

మార్కాపురం: మార్కాపురంలోని జిల్లా వైద్యశాలలో 28 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ సుబ్బారెడ్డి తెలిపారు. అపరిచిత వ్యక్తులు, వైద్యశాలకు రోగులతో పాటు వచ్చే పలువురు గొడవలు చేస్తున్న దృష్ట్యా సీసీ కెమెరాలు బిగించారు. జిల్లా వైద్యశాల ఎంట్రన్స్‌తో పాటు ఓపీ రూమ్, క్యాజువాలిటీ వార్డు, స్త్రీల వార్డులు, పురుషుల వార్డులు, మందుల గది తదితర ప్రాంతాల్లో కెమెరాలు బిగించి నిరంతరం సిబ్బందితో పాటు వైద్యశాలకు వచ్చే వారి రాకపోకలను గమనిస్తుంటామన్నారు.

కొండచిలువ పట్టివేత



పట్టుకున్న కొండచిలువతో నిరంజన్

తర్లుపాడు: మండలంలోని గానుగపెంట గ్రామంలో సుమారు 11 అడుగుల పొడవున్న కొండచిలువ గురువారం అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో పట్టుబడింది. గ్రామంలోని రైతులు పొలాలకు వెళ్లే దారిలో కొండచిలువను గమనించి స్నేక్ రెస్క్యూవర్ నిరంజన్‌కు సమాచారం ఇవ్వటంతో దాన్ని పట్టుకుని అడవిలో వదిలిపెట్టినట్లు తెలిపారు.


ఆలయాల్లో విద్యుత్ శాఖ సీఎండీ పూజలు



త్రిపురాంతకం ఆలయాల్లో పూజల్లో పాల్గొన్న విద్యుత్ శాఖ సీఎండీ పద్మజనార్దన్ రెడ్డి

త్రిపురాంతకం: శ్రీబాలాత్రిపురసుందరీదేవి, శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి వారి ఆలయాల్లో విద్యుత్ శాఖ సీఎండీ పద్మ జనార్దన్‌రెడ్డి కుటుంబ సమేతంగా వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం సందర్భంగా పెద్దసంఖ్యలో భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. త్రిపురాంతకం అమ్మవారు, స్వామి వారి ఆలయాల్లో జనార్దనరెడ్డి అభిషేకాలు, కుంకుమార్చనలు అర్చకులు ప్రసాదశర్మ, విశ్వనారాయణశాస్త్రి నిర్వహించారు. ఆలయాల ఈఓ చెన్నకేశవరెడ్డి, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పద్మజ మల్లికార్జున్ సాదర స్వాగతం పలికారు. ఈయన వెంట విద్యుత్ అధికారులు ఈఈ శివనాగేశ్వరరావు, డీఈలు శివనాగేశ్వరరావు, సత్యనారాయణ, ఏఈ మంగారావు, ఎల్ఐ శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి మెగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న కృష్ణమోహన్‌రెడ్డి, పక్కన సూర్యప్రకాష్‌రెడ్డి

మార్కాపురం: మండలంలోని బిరుదలనర్వ గ్రామంలో శుక్రవారం రాష్ట్ర స్థాయి మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సోదరుడు, మాజీ వైస్ ఎంపీపీ కుందురు కృష్ణమోహన్‌రెడ్డి, పార్టీ నాయకులు పి.సూర్యప్రకాష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ చిన్న గ్రామంలో రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ నిర్వహించటం అభినందనీయమన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. ప్రథమ బహుమతిగా రూ.50,116, ద్వితీయ బహుమతి రూ.20,116 కృష్ణమోహన్ రెడ్డి, సూర్యప్రకాష్‌రెడ్డిలు, మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌కి జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి బహుమతులు అందిస్తారని నిర్వాహకులు తెలిపారు. మాజీ డీఆర్‌యూసీసీ మెంబర్ ఎంఎస్ రెడ్డి, వైస్ ఎంపీపీ బండి లక్ష్మీదేవి కృష్ణారెడ్డి, వై.శ్రీనివాసరెడ్డి, కె.వెంకటయ్య, డి.చిన్న సిద్దయ్య, రాంజేంద్రరావు, రాచమడుగు బాలకృష్ణ, డీలర్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కొత్త..కొత్తగా..

ఇప్పటి వరకూ ఉమ్మడి ప్రకాశం పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను పునర్విభజన చేశారు. పరిపాలనా సౌలభ్యం కోసం ఈ ప్రక్రియ చేపట్టారు. పాత జిల్లాలో 4,234 కేంద్రాలు ఉండగా, విభజన తర్వాత 2,903 అంగన్‌వాడీ కేంద్రాలను జిల్లాకు కేటాయించారు. మిగిలిన వాటిల్లో 994 బాపట్ల, 347 శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా పరిధిలోకి వెళ్లాయి.



ఐసీడీఎస్ కార్యాలయం

- అంగన్‌వాడీల పునర్విభజన పూర్తి
- ఒంగోలులోనే ఆర్‌జేడీ కార్యాలయం
- ఈ నెల 8న ఉత్తర్వులు జారీ చేసిన డైరెక్టర్

విభజన తర్వాత జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు **2,903**

మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు **2,676**

ఐసీడీఎస్ ప్రాజెక్టులు **13**

మినీ అంగన్‌వాడీలు **227**

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: కొత్త జిల్లాలు ఏర్పడి సంవత్సరం అవుతున్నా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ విభజన మాత్రం జరగలేదు. ఉమ్మడి జిల్లా పరిధిలోనే అంగన్‌వాడీ ప్రాజెక్టులు కొనసాగుతూ వచ్చాయి. అలాగే మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) కార్యాలయం ఒంగోలులోనే ఉంది. ప్రకాశం, నెల్లూరు, గుంటూరు ఉమ్మడి జిల్లాలు ఒంగోలు ఆర్‌జేడీ కార్యాలయ పరిధిలోనే ఉన్నాయి. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ల ఖాళీల భర్తీ సందర్భంగా ఇటీవల పరీక్ష నిర్వహించారు. అయితే, కొత్తగా ఏర్పడిన బాపట్ల, పల్నాడు, నెల్లూరు, తిరుపతి జిల్లాల పరిధిలోకి వెళ్లిన అంగన్‌వాడీ సెక్టార్లకు చెందిన వారు సైతం ఒంగోలు కేంద్రంగా పరీక్ష రాయాల్సి వచ్చింది. రాష్ట్రంలో అన్ని రీజియన్లలో ఇదే పరిస్థితి తలెత్తింది. దీంతో అంగన్‌వాడీ ప్రాజెక్టులను విభజించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పరిపాలనా సౌలభ్యం నిమిత్తం అంగన్‌వాడీ ప్రాజెక్టులను పునర్విభజన చేశారు. ఆ మేరకు ఈ నెల 8వ తేదీ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ముద్దాడ రవిచంద్ర ఉత్తర్వులు జారీ చేశారు.

స్వరూపం ఇలా...

ఒంగోలు ఐసీడీఎస్ ప్రాజెక్టు:
ఒంగోలు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 274 అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అందులో 268 మెయిన్, 6 మినీ అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఈ ప్రాజెక్టు పరిధిలో ఒంగోలు నగరపాలక సంస్థతో పాటు ఒంగోలు మండలం, కొత్తపట్నం మండలాలు ఉన్నాయి.

టంగుటూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు:
టంగుటూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 215 అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అందులో 212 మెయిన్, 3 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ ప్రాజెక్టు పరిధిలో టంగుటూరు, సింగరాయకొండ, జరుగుమల్లి మండలాలున్నాయి.

కొండపి ఐసీడీఎస్ ప్రాజెక్టు:
కొండపి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 166 అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అందులో 212 మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఈ ప్రాజెక్టు పరిధిలో కొండపి, మర్రిపూడి, పొన్నలూరు మండలాలు ఉన్నాయి.

మద్దిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు:
మద్దిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 286 అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అందులో 276 మెయిన్, 10 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ ప్రాజెక్టు పరిధిలో మద్దిపాడు, చీమకుర్తి, చీమకుర్తి నగర పంచాయితీ, సంతనూతలపాడు, నాగులుప్పలపాడు మండలాలున్నాయి.

దర్శి ఐసీడీఎస్ ప్రాజెక్టు:
దర్శి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 334 అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అందులో 332 మెయిన్, 2 మినీ అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఈ ప్రాజెక్టు పరిధిలో దర్శి, కురిచేడు, దొనకొండ, ముండ్లమూరు, తాళ్లూరు మండలాలు ఉన్నాయి.

వెలిగండ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు:
వెలిగండ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 205 అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అందులో 158 మెయిన్, 47 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ ప్రాజెక్టు పరిధిలో వెలిగండ్ల, హెచ్ఎంపాడు, సీఎస్ పురం మండలాలు ఉన్నాయి.

కనిగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు:
కనిగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 238 అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అందులో 184 మెయిన్, 54 మినీ అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఈ ప్రాజెక్టు పరిధిలో కనిగిరి, కనిగిరి నగర పంచాయతీ, పీసీ పల్లి, పామూరు మండలాలు ఉన్నాయి.

పొదిలి ఐసీడీఎస్ ప్రాజెక్టు:
పొదిలి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 149 అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అందులో 158 మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఈ ప్రాజెక్టు పరిధిలో పొదిలి, కొనకనమిట్ల మండలాలు ఉన్నాయి.

మార్కాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు:
మార్కాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 208 అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అందులో 198 మెయిన్, 10 మినీ అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఈ ప్రాజెక్టు పరిధిలో మార్కాపురం, మార్కాపురం మున్సిపాలిటీ, తర్లుపాడు మండలాలు ఉన్నాయి.

బేస్తవారిపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు:
బేస్తవారిపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 199 అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అందులో 185 మెయిన్, 14 మినీ అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఈ ప్రాజెక్టు పరిధిలో బేస్తవారిపేట, కంభం, అర్ధవీడు మండలాలు ఉన్నాయి.

గిద్దలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు:
గిద్దలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 233 అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అందులో 201 మెయిన్, 32 మినీ అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఈ ప్రాజెక్టు పరిధిలో గిద్దలూరు, గిద్దలూరు నగర పంచాయతీ, రాచర్ల, కొమరోలు మండలాలు ఉన్నాయి.

దోర్నాల ఐసీడీఎస్ ప్రాజెక్టు:
దోర్నాల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 148 అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అందులో 126 మెయిన్, 22 మినీ అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఈ ప్రాజెక్టు పరిధిలో దోర్నాల, పెద్దారవీడు మండలాలు ఉన్నాయి.

యర్రగొండపాలెం ఐసీడీఎస్ ప్రాజెక్టు:
యర్రగొండపాలెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 248 అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అందులో 221 మెయిన్, 77 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ ప్రాజెక్టు పరిధిలో యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం మండలాలున్నాయి.

జిల్లాకు 2,903 అంగన్‌వాడీ కేంద్రాలు

ఉమ్మడి జిల్లాలో 4234 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా జిల్లాకు 2,903 కేటాయించారు. బాపట్లకు 994, నెల్లూరుకు 347 ఇచ్చారు. అలాగే 21 ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ స్కీం (ఐసీడీఎస్) ప్రాజెక్టులు ఉండగా జిల్లాకు 13 కేటాయించారు . జిల్లాలో ఉన్న మొత్తం 38 మండలాలు, ఒంగోలు నగరపాలక సంస్థతో పాటు మరో నాలుగు మున్సిపాలిటీలలో కలుపుకుని ఈ ప్రాజెక్టులను ఏర్పాటు చేశారు. ఆయా ప్రాజెక్టుల పరిధిలో 2,676 ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు, 227 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు కూడా ఏర్పాటు చేశారు. ఆర్‌జేడీ కార్యాలయం ఒంగోలు కేంద్రంగా కొనసాగుతోంది. జిల్లా కేంద్రంలో ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ) కార్యాలయం కూడా ఉంటుంది.

మంచి పాలన అందిస్తున్న ఘనత జగన్‌దే



గడప గడప కార్యక్రమంలో లబ్ధిదారులతో మంత్రి ఆదిమూలపు సురేష్

- మంత్రి ఆదిమూలపు సురేష్
- చిన్నగుడిపాడులో ఘనంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం
- సురేష్‌కు అడుగడుగునా ఘన స్వాగతం

పెద్దదోర్నాల: రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడుకుంటూ అందరికీ సంక్షేమ పథకాలు అందేలా మంచి పాలన అందిస్తున్న ఘనత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిదేనని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ కొనియాడారు. వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు గంటా రమణారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిధిలోని చిన్నగుడిపాడులో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ జగనన్న నాలుగేళ్ల పాలన జవాబుదారితనంతో సాగిందన్నారు. సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కరోనా కష్టకాలంలో కూడా పాలనను సజావుగా ముందుకు తీసుకెళ్లగలిగారని చెప్పారు. ఎన్నికల ముందు జగనన్న చేసిన సుదూర పాదయాత్రలో పొదుపు మహిళలు తాము చేసిన అప్పులు కట్టలేక నలిగిపోతున్న పరిస్థితిని కళ్లారా చూశారన్నారు. మహిళల అప్పులను విడతల వారీగా రద్దుచేస్తానని ఆనాడు మాట ఇచ్చారని, ఆ మాట ప్రకారమే నవరత్నాల్లో చేర్చి విడతల వారీగా నగదును నేరుగా మహిళల అకౌంట్‌లలో జమ చేశారని చెప్పారు. అమ్మ ఒడి, వైఎస్సార్ భరోసా, నేతన్న నేస్తం, కాపు నేస్తం, ఆసరా, చేయూత, విద్యాకానుక, వసతి దీవెన, విద్యా దీవెన అన్ని పథకాలను ఆపకుండా పరిపాలన చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. గతంలో జరిగిన ఎన్నికల సందర్భంగా టీడీపీ నేతలు ఏదో ఒక రకంగా తిరిగి అధికారాన్ని చేజిక్కించుకోవాలన్న లక్ష్యంతో అనేక వాగ్దానాలు చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఏ ఒక్కవాగ్దానం నెరవేర్చలేక పోయారని విమర్శించారు. వైఎస్సార్ అధికారంలో ఉన్న సమయంలో పొదుపు మహిళలకు పావలా వడ్డీకే రుణాలు ఇచ్చారని, ఆయన తనయుడు మరో అడుగు ముందుకు వేసి సున్నా వడ్డీకే రుణాలు ఇప్పిస్తున్నారని కొనియాడారు. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే కరువు కాటకాలతో అలమటిస్తున్న పశ్చిమ ప్రాంతాన్ని ఆదుకోవాలన్న ఉద్దేశంతో టన్నెల్ పనులను వేగవంతం చేసి మొదటి టన్నెల్ పూర్తి చేశారన్నారు. ప్రభుత్వ పథకాలతో కూడిన కరపత్రాలను ప్రతి కుటుంబంలోని పెద్దలకు అందజేసి వారు ప్రభుత్వం నుంచి ఎంత లబ్ధి పొందారో వారికి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వల్లభనేని పవన్‌కుమార్, దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ దూదేకుల ఖాశింపీరా, మండల పార్టీ ఉపాధ్యక్షుడు వెన్నా కాశిరెడ్డి, ఒంటేరు నాగేశ్వరరావు, మాజీ మండల అధ్యక్షుడు జోగి వెంకటనారాయణ, ఎంపీటీసీ సభ్యులు రాధాకృష్ణ, చిట్యాల యోగిరెడ్డి, ఒంటేరు ఆంజనేయులు, యేరువ గాలిరెడ్డి, దూదేకుల రసూల్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన అందించడమే ధ్యేయం

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్
- పెద్దదోర్నాలలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

పెద్దదోర్నాల: రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పాలన అందివ్వాలని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాన ధ్యేయంగా పెట్టుకున్నారని, ఆ దిశగా అడుగులు వేస్తున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక శ్రీశైలం రోడ్డులోని పున్నమి హైవే రిసార్ట్స్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి మండల పార్టీ కన్వీనర్ గంటా రమణారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా 'మా నమ్మకం నువ్వే జగన్' అనే కార్యక్రమంపై ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత జగనన్న అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి కరోనా కష్టకాలంలో రాష్ట్రం ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నా దిగ్విజయంగా అమలు చేస్తున్నారని తెలిపారు. మూడేళ్లగా సంక్షేమ పథకాలపై ప్రతిపక్షాలు గగ్గోలు పెట్టాయని, లబ్ధిదారుల అకౌంట్‌లలో నేరుగా నగదు జమ చేయడం ఇష్టంలేని పచ్చనేతలు రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేస్తున్నారని విమర్శలకు దిగారని అన్నారు. ప్రజలకు అందిస్తున్న పథకాలు నచ్చలేదని, నిలిపి వేయాలని మాత్రం అనడంలేదని, ఎన్నికలు సమీపిస్తుండటంతో ఇప్పుడు సిగ్గులేకుండా పథకాలను కొనసాగిస్తామని, ఇంకా మెరుగుపరుస్తామని అంటున్నారని ఎద్దేవా చేశారు. రానున్న ఎన్నికల్లో జగన్‌ను సీఎం కానివ్వం, వైఎస్సార్ సీపీ అధికారంలోకి రానివ్వం.. ఇది తనకు చివరి ఎన్నికలు, లాస్ట్ ఛాన్స్, లాస్ట్ ఛాన్స్ అంటూ ఒకాయన తిరుగుతున్నాడని, మరొకాయన ఒక్క ఛాన్స్ ఇవ్వండంటూ వేడుకుంటున్నాడని ఆయన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ల గురించి వ్యంగ్యంగా అన్నారు. ఈ పాటికే 5 కోట్ల మంది రాష్ట్ర ప్రజలు తీర్మానం చేసుకున్నారని.. ప్రజలు ఎప్పుడూ సంక్షేమ సీఎం కావాలనుకుంటారేకానీ, నమ్మించి మోసంచేసే వారిని దగ్గరకు రానివ్వరని అన్నారు. సంక్షేమ పథకాలను ప్రజలకు సక్రమంగా అందివ్వాలన్న ఉద్దేశంతో వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెడితే వారిని పార్టీ వ్యవహారాలకు ఉపయోగించుకుంటున్నారని పచ్చనేతలు దుర్మార్గపు ప్రచారం చేస్తున్నారని ఆయన విమర్శించారు. జగనన్న కొత్తగా అమలు పరుస్తున్న సచివాలయ కన్వీనర్లు, వారితోపాటు పనిచేసేందుకు ఏర్పాటవుతున్న గృహ సారథులు గడప గడపకు తిరిగి సంక్షేమ పథకాల గురించి ప్రచారం చేస్తారని, దీనివలన ప్రజలకు మరింత మేలు జరుగుతుందని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాలు చేపట్టి మూడేళ్లగా జరిగిన లబ్ధి గురించి వివరించి, ఇంకేమి కావాలని అడుగుతున్నారని, ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలను సైతం టీడీపీ నాయకులు వదలకుండా అడ్డగోలుగా విమర్శలు చేస్తున్నారని అన్నారు. వలంటీర్లు అధికారపక్షంగా పనిచేస్తారని, సచివాలయ కన్వీనర్లు పార్టీ పక్షంగా పనిచేస్తారని చెప్పారు. కన్వీనర్లు, గృహసారథులు వైఎస్సార్ సీపీకి చెవులు, కళ్లులాంటివారని, 2019కి ముందు ఏ విధంగా పనిచేశామో అదేవిధంగా 15 నెలలపాటు కష్టపడి పనిచేయాలని సూచించారు. అప్పుడే రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నట్లు సంక్షేమ ప్రభుత్వాన్ని మరో పర్యాయం ఏర్పాటు చేసుకోగలుగుతామని, జగనన్నను సీఎంగా చూసుకోగలుగుతామని ఆయన అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చిత్తూరి హారిక, జెడ్పీటీసీ సభ్యురాలు దుమావత్ లతాబాయి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు దర్శనం నాగయ్య, మండల పార్టీ ఉపాధ్యక్షులు వెన్నా కాశిరెడ్డి, ఒంటేరు నాగేశ్వరరావు, మండల నాయకులు గుమ్మా యల్లేష్, చంద్రకాంత్‌నాయక్, యక్కంటి లింగారెడ్డి, జంకె సుబ్బారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ గూండారెడ్డి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సచివాలయ కన్వీనర్లకు కిట్లను అందజేస్తున్న మంత్రి సురేష్

అనాథ పిల్లల దత్తతకు కలెక్టర్ ఆమోదం

ఒంగోలు అర్బన్: అనాథ పిల్లలను దత్తత ఇచ్చేందుకు వచ్చిన ప్రతిపాదనలకు కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆమోదం తెలిపారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ సమావేశం నిర్వహించారు. దీనిలో డీసీపీవోలు ఐదుగురు పిల్లలను దత్త ఇచ్చేందుకు అవసరమైన డాక్యుమెంటేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు వివరాలను కలెక్టర్‌కు తెలిపారు. వెంటనే తదుపరి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. దత్తత తీసుకునేందుకు ముందుకొచ్చే వారికి చిన్నారుల వివరాలు అందుబాటులో ఉండేలా వాటిని సెంట్రల్ అడాప్షన్ రీసెర్స్ ఏజెన్సీకి తెలియచేయాలన్నారు. దత్తత ఇచ్చేందుకు పెండింగ్‌లో ఉన్న పిల్లలకు సంబంధించిన డాక్యుమెంటేషన్ ప్రక్రియ కూడా త్వరగా పూర్తి చేసి ఆమోదం పొందాలన్నారు. జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణ, సంక్షేమానికి సీడబ్ల్యూసీ, డీసీపీఓ సమష్టిగా పనిచేయాలన్నారు. సమావేశంలో సీడబ్ల్యూసీ చైర్మన్ వేము రామాంజనేయులు, సభ్యులు నీలిమ, వంశీలత, సీహెచ్ ప్రసాదరావు, టీ శివశంకర్, కే సుమనశ్రీ, డీసీపీవో దినేష్‌కుమార్, ఏపీఎస్‌సీపీసీఆర్ సభ్యురాలు బత్తుల పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



సీడబ్ల్యూసీ సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

ఆక్వా సాగును ప్రోత్సహించాలి

- ఆక్వా జోన్‌ల ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్ దినేష్ కుమార్



మత్స్యశాఖ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు అర్బన్: జిల్లాలో ఆక్వాసాగును ప్రోత్సహించాలని, ఆక్వా జోన్‌ల ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు జోన్‌లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం ప్రకాశం భవనంలో ఆక్వాజోన్ జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. తొలుత ఆక్వా జోన్‌ల ఏర్పాటు వాటి ఆవశ్యకత, అధికారులు తీసుకుంటున్న చర్యలపై మత్స్య శాఖ జేడీ చంద్రశేఖర్ రెడ్డి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆక్వా సాగు మరింత పెంచేందుకు శాస్త్రవేత్తలు, నిపుణులు, ఆక్వా రైతుల నుంచి అభిప్రాయ సేకరణ తీసుకోవాలన్నారు. ఆక్వా కల్చర్ జోన్ ఏర్పాట్లతో స్థిరమైన ఆక్వా సాగు సాధ్యమన్నారు. పర్యావరణ హిత ఆక్వాసాగును ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో 5 మండలాల్లో 16 గ్రామ పంచాయతీల్లో 1245.77 ఎకరాల్లో ఆక్వాసాగును ఆక్వా జోన్‌లోకి తీసుకొచ్చేందుకు కమిటీ ఆమోదం తెలిపింది. దీనిలో కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీశైలం మల్లన్న గుడిపాగా ఊరేగింపు

వేటపాలెం: బాపట్ల జిల్లా వేటపాలెం మండల పరిధిలోని రామన్నపేట గ్రామంలో శ్రీశైలం మల్లన్న గుడి పాగా ఊరేగింపు శివస్వాములు, గ్రామ సేనాధిపతులతో మంగళ వాయిద్యాల మధ్య వైభవంగా శుక్రవారం నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినం రోజు లింగోద్భవ సమయంలో శ్రీశైల పుణ్యక్షేత్రంలో స్వామివారికి గర్భాలయంపై గుడిపాగా అలంకరిస్తారు. ఆ పాగాని నేతనేసే అవకాశం ఈ ప్రాంత దేవాంగు వంశస్తులకు లభించింది. హస్తినాపురం వాస్తవ్యులు పృథ్వి వెంకటేశ్వర్లు మహాశివరాత్రి పర్వదినం రోజు లింగోద్భవ సమయంలో వివస్త్రులై శ్రీశైల మల్లన్న స్వామి వారి గర్భాలయ గోపురం నుంచి నందుల వరకు చుట్టే 60 మీటర్ల తెల్లటి పాగా వస్త్రాన్ని తయారు చేసే అవకాశం రామన్నపేట పంచాయతీ కొత్తనగర్‌కు చెందిన సాధు శ్రీనివాసరావు, శ్రీలక్ష్మి దంపతులకు దక్కింది. తలపాగాని గ్రామంలో ఊరేగించి శివరాత్రి రోజుకు శ్రీశైలం తీసుకెళ్లనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్పీటీసీ బండ్ల తిరుమలాదేవి, బండ్ల వెంకటేశ్వర్లు ఊరేగింపులో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది ఈ ప్రాంత దేవాంగులు స్వామి వారికి తలపాగా నేత నేసి శ్రీశైలం తరలించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కార్యక్రమంలో దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్ర, గ్రామ సేనాధిపతులు దేవన వెంకటేశ్వర్లు, రామలింగం, ఉమ్మిటి మాధవరావు, ఉమ్మిడి వెంకటసుబ్బారావు, ఉమ్మిడి సూర్యనారాయణ, బాపట్ల జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కుర్మా రాహుల్ పాల్గొన్నారు.



శ్రీశైలం మల్లన్న తలపాగాను ఊరేగింపుగా తీసుకెళ్తున్న జెడ్పీటీసీ దంపతులు

క్లుప్తంగా

గుప్తనిధుల కోసం తవ్వకాలు



గంగమ్మ తల్లి దేవాలయం వద్ద తవ్వకాలు

కొమరోలు: గుప్త నిధుల కోసం గుర్తు తెలియని వ్యక్తులు దేవాలయంలో తవ్వకాలు నిర్వహించారు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. మండలంలోని అయ్యవారిపల్లె గ్రామంలో వెలసిన గంగమ్మతల్లి ఆలయం వద్ద 3 అడుగుల రాతిబండలను తొలగించి తవ్వకాలు చేసినట్లు స్థానికులు గుర్తించారు. గ్రామస్తులు ఈ తవ్వకాలను గుర్తించి స్థానిక పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై ఎ.సుబ్బరాజు సిబ్బందితో శుక్రవారం సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై సుబ్బరాజు మాట్లాడుతూ గుప్తనిధుల తవ్వకాలు జరిపి ఉండరని, ఆకతాయిలు చేసిన పనిగా భావిస్తున్నామని, గ్రామస్తులను విచారిస్తున్నట్లుగా తెలిపారు.

విధుల నుంచి హాస్టల్ వార్డెన్ తొలగింపు

ఒంగోలు: స్థానిక తూర్పు క్రిస్టియన్ పాలెం సాంఘిక సంక్షేమశాఖ బాలుర వసతి గృహం -3 వార్డెన్‌గా విధులు నిర్వహిస్తున్న ఆవుల మంద శ్రీనివాసరావును విధుల నుంచి తొలగిస్తూ కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల వార్డెన్ హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రుల పట్ల అమర్యాదగా ప్రవర్తిస్తున్నట్లు ఆరోపణలు రావడంతో సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మానాయక్ విచారణకు ఆదేశించారు. విచారణాధికారి టి.లింగయ్య ఇచ్చిన నివేదికపై కలెక్టర్ శుక్రవారం వార్డెన్‌ను విధులు నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. తాత్కాలికంగా హాస్టల్ 3 వార్డెన్‌గా 7వ హాస్టల్ వార్డెన్‌గా విధులు నిర్వహిస్తున్న ధారా అంకబాబుకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

పెద్దపులి దాడిలో ఆవు మృతి



పెద్దపులి మృతకళేబరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పెద్దదోర్నాల: పెద్దపులి దాడిలో ఆవు మృతి చెందింది. ఈ సంఘటన మండల పరిధిలోని దేవలూడు బీట్ పరిధిలో సోమవారం జరగ్గా.. శుక్రవారం వెలుగుచూసింది. ఈ సంఘటనలో బోడేనాయక్‌తాండా రైతు కేతావత్ హనుమంతు నాయక్‌కు చెందిన ఆవు మృతి చెందింది. అటవీశాఖ అధికారులు అందించిన సమాచారం మేరకు..ఈ నెల 6వ తేదీ సోమవారం మండల పరిధిలోని దేవలూడు ప్రాంతానికి మేతకు వెళ్లిన ఆవు తిరిగి రాకపోవడంతో తప్పి పోయిందని భావించి దాని కోసం వెతుకులాట ప్రారంభించారు. ఈ నేపథ్యంలో పులి దాడిలో చనిపోయిన ఆవు కళేబరాన్ని శుక్రవారం గుర్తించారు. సంఘటనా స్థలిని ఫారెస్టు రేంజ్ అధికారి విశ్వేశ్వరరావు, డీఆర్వో సోమసుందర్‌లు సందర్శించారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తుల బైండోవర్



గంజాయి తరలిస్తున్న వ్యక్తులను తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసిన పోలీసులు

మద్దిపాడు: గంజాయి తరలిస్తూ పట్టుబడిన ఇద్దరిని శుక్రవారం మద్దిపాడు తహసీల్దార్ లక్ష్మీనారాయణ వద్ద బైండోవర్ చేశారు. వివరాల్లోకి వెళితే.. అద్దంకి వైపు నుంచి మండలంలోని తెల్లబాడు మీదుగా గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని గత నెల 14న ఇద్దరిని చీమకుర్తి ఎక్సైజ్ పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. వారి వద్ద 1300 గ్రాముల గంజాయి దొరికింది. దీనిపై విచారించి కేసు నమోదు చేశారు. అద్దంకి మండలం మోదేపల్లికి చెందిన అనపర్తి ఫిలిప్, దాసరి సుబ్బారావు, దాసరి నరసింహారావు, వినుకొండకు చెందిన మేడిపల్లి వెంకటేశ్వర్లులను తహసీల్దార్ విచారించి బైండోవర్ చేశారు. మరోసారి గంజాయి తరలిస్తూ పట్టుబడితే రూ.2 లక్షల జరిమానాతో పాటు నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎక్సైజ్ ఎస్సై ఎం శ్రీనగేశ్, షేక్ యూసఫ్ షరీఫ్ కానిస్టేబుల్ రామిరెడ్డి పాల్గొన్నారు.

గంజాయి రవాణాపై రైల్వేస్టేషన్లో తనిఖీలు

ఒంగోలు టౌన్: గంజాయి రవాణా చేయడం చట్టరీత్యా నేరమని రైల్వే ఇన్‌స్పెక్టర్ వై.రామారావు తెలిపారు. ఒంగోలు రైల్వే స్టేషన్‌లో శుక్రవారం ఆయన తనిఖీలు నిర్వహించారు. స్టేషన్‌లోని ప్లాట్‌ఫాంలు, పార్శిల్ ఆఫీసు పరిసరాల్లో తనిఖీలు నిర్వహించిన ఆయన హమాలీలకు గంజాయి అక్రమ రవాణా గురించి అవగాహన కల్పించారు. రైల్వేస్టేషన్ పరిసరాల్లో గంజాయి అక్రమ రవాణా, విక్రయాల గురించి సమాచారం లభిస్తే వెంటనే రైల్వే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. రైల్వే ఎస్సై పి.వెంకటేశ్వర్లు, ఆర్‌పీఎఫ్, జీపీఆర్ సిబ్బంది ఉన్నారు.

అఘాయిత్యం, బెదిరింపులతోనే ఆత్మహత్య



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న దిశా డీఎస్పీ పల్లపురాజు



కిరణ్మయి మృతదేహానికి పోస్టుమార్టం చేస్తున్న వైద్యులు

- కిరణ్మయి మృతదేహానికి పోస్టుమార్టం
- దిశ డీఎస్పీ పల్లపురాజు

ముండ్లమూరు: బీటెక్ విద్యార్థిని గూడాల కిరణ్మయినిపై అదే గ్రామానికి చెందిన చింతల వెంకటనారాయణరెడ్డి అఘాయిత్యానికి పాల్పడి, బెదిరించడంతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు దిశ డీఎస్పీ పల్లపురాజు తెలిపారు. మండలంలోని ఉమామహేశ్వరపురంలో కిరణ్మయి మృతదేహానికి తహసీల్దార్ ఉషారాణి ఆధ్వర్యంలో ఒంగోలు ప్రభుత్వ మెడికల్ కళాశాల వైద్యులు సురేష్, దుర్గాప్రసాద్, మాధురి, మరో ఇద్దరు కలిసి శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం డీఎస్పీ పల్లపురాజు విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కిరణ్మయి విశాఖపట్నంలోని గాయత్రీ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతుంది. చింతల వెంకటనారాయణరెడ్డి జనవరి 11న తన స్నేహితునితో కలిసి వైజాగ్ వెళ్లి కిరణ్మయిని కలిశారు. అక్కడ బలవంతంగా కిరణ్మయి సెల్‌ఫోన్, బంగారపు ఉంగరాన్ని లాక్కొని బెదిరించారు. అక్కడి నుంచి వేరే ప్రాంతానికి తీసుకెళ్లి వెంకట నారాయణరెడ్డి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఆ సమయంలో వీడియోలు, ఫొటోలు తీసి బెదిరించాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే ఫొటోలు వైరల్ చేస్తానని, చంపేస్తానని బెదిరించాడు. దీంతో మనస్తాపం చెందిన కిరణ్మయి స్వగ్రామం చేరుకుంది. 13వ తేదీన గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబసభ్యులు ఒంగోలుకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో పరిస్థితి విషమించింది. దీంతో తిరిగి ఒంగోలు తీసుకువస్తుండగా మార్గమధ్యంలో 15వ తేదీన మృతి చెందినట్లు తెలిపారు. దీంతో కుటుంబసభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. గ్రామంలో విచారణ పూర్తి చేశామన్నారు. అమ్మాయి చదువుతున్న కళాశాల, అఘాయిత్యం జరిగిన ప్రాంతాలను పరిశీలించి విచారణ చేయాల్సి ఉందన్నారు. విచారణ అనంతరం నిందితులపై కఠిన చర్యలు తప్పవని తెలిపారు. ఆయన వెంట ఎస్సై ఎల్ సంపత్‌కుమార్, సిబ్బంది ఉన్నారు. వీఆర్వో దయానందం ఉన్నారు.

పెళ్లయిన రెండు వారాలకే మృత్యు ఒడికి

- ద్విచక్రవాహనం అదుపు తప్పి వ్యక్తి మృతి
- మరో వ్యక్తికి తీవ్ర గాయాలు
- మృతునికి గత నెల 27నే వివాహం



గాలయ్య మృతదేహం



గాయాలపాలైన సురేష్

దొనకొండ: వివాహమైన రెండు వారాలకే వరుడు మృత్యుఒడికి చేరాడు. వేగంగా వస్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన స్థానిక అడ్డరోడ్డు నుంచి యర్రబాలెం వెళ్లే మలుపు వద్ద శుక్రవారం సాయంత్రం జరిగింది. మండలంలోని పెద్దగుడిపాడు గ్రామానికి చెందిన సుంకేసుల గాలయ్య (22), నరసింహనాయునిపాలెంకు చెందిన కాకర్ల సురేష్‌రెడ్డి ఇద్దరు దొనకొండ నుంచి కురిచేడుకు వెళ్లారు. అక్కడ సినిమా చూసి తిరిగి దొనకొండకు వస్తుండగా యర్రబాలెం గ్రామం దాటి కొంత దూరం వచ్చిన తర్వాత మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టింది. ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలై పడిపోయారు. సమాచారం తెలుసుకున్న స్థానికులు వారిని అడ్డరోడ్డుకు తీసుకువచ్చి ఆర్‌ఎంపీ వద్ద ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం నిమిత్తం బంధువులు వినుకొండకు తీసుకెళ్లారు. గాలయ్యకు తీవ్ర గాయాలు కావటంతో మృతి చెందాడు. గాలయ్యకు గత నెల 27వ తేదీనే వివాహమైంది. గాలయ్య మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురావటంతో కుటుంబసభ్యులు, బంధువుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతం శోకసంద్రంగా మారింది.

క్రీడాకారులకు కలెక్టర్ అభినందన



ప్రతిభ చాటిన క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: హైదరాబాద్‌లో జరిగిన మాస్టర్ అథ్లెటిక్స్ అండ్ స్పోర్ట్స్‌లో రాష్ట్రం నుంచి పాల్గొన్న మన జిల్లాకు చెందిన 15 మంది క్రీడాకారులను కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ప్రకాశంభవనంలో ప్రత్యేకంగా అభినందించారు. గచ్చిబౌలిలో జరిగిన అథ్లెటిక్స్‌లో 15 మంది క్రీడాకారులు 25మెడల్స్ మన రాష్ట్రానికి తీసుకువచ్చారు. వీరంతా మేలో దక్షిణా కొరియాలో జరిగే అంతర్జాతీయ స్థాయి క్రీడల్లోనూ రాణించి దేశానికి మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ ప్రోత్సహించారు. ఫుట్‌బాల్, కబడ్డీ క్రీడల్లో మెడల్స్ సాధించిన వారిలో ఎండీ హాజీరాబేగం రెండు బంగారు, ఒక వెండి, డి.శ్యామల 4బంగారు, ఎండీ అల్లా రఖీ రెండు బంగారు, వరలక్ష్మి మూడు బంగారు, ఒక వెండి, టి.సురేష్‌కుమార్ ఒక గోల్డ్, ఒక కాంస్య, కె.రాజేశ్వరి రెండు బంగారు, ఎస్‌కే సనామి రెండు బంగారు, రెండువెండి, కె.మేనేక ఒక బంగారు, ఒక వెండి, సాగర్ రెండు బంగారు, రాజేంద్ర బంగారు, యేసయ్య ఒక బంగారు, నాగయ్య మూడు బంగారు, నిరంజన్ ఒక బంగారు పతకం సాధించారు.


సీఈఓలు పోటీతత్వంతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీఓ రాజశేఖర్

కనిగిరి రూరల్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్) సీఈఓలు పోటీతత్వంతో పనిచేయాలని జిల్లా సహకార శాఖాధికారి పి.రాజశేఖర్ అన్నారు. స్థానిక పీడీసీసీ బ్యాంకు సమావేశ మందిరంలో కనిగిరి సహకార శాఖ డివిజన్ పరిధిలోని పీఏసీఎస్ సీఈఓలు, సహకార శాఖ, పీడీసీసీ బ్యాంకు అధికారులు, సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీసీఓ రాజశేఖర్ మాట్లాడుతూ కేంద్ర సహకార మంత్రిత్వశాఖ సాధించిన ప్రగతి, 2023–24 బడ్జెట్‌లో కేటాయింపులపై విశ్లేషించారు. ఇటీవల ప్రకటించిన కేంద్ర బడ్జెట్‌లో సహకార శాఖకు అందిన కేటాయింపులు, సహకార సంఘాల చట్టం -1964లో జరిగిన సవరణలు, మల్టీ స్టేట్ కోఆపరేటివ్ సొసైటీస్‌లో సవరణ బిల్లుల అంశాలపై అవగాహన కల్పించారు. నేషనల్ కోఆపరేటివ్ డేటాబేస్, పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ, 2022–23 ఆడిట్ లాంటి వాటి కోసం సన్నద్ధంగా ఉండాలన్నారు. కామన్ సర్వీస్ సెంటర్లుగా పీఏసీఎస్‌లను ఏర్పాటు చేయాలని సంకల్పిస్తున్నామన్నారు. రానున్న రోజులు సహకార రంగానికి స్వర్ణయుగమని తెలిపారు. సీఈఓలు పోటీపడి మరీ పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పీడీసీసీ బ్యాంకు సీఈఓ కె.రాఘవయ్య మాట్లాడుతూ సహకార శాఖ, బ్యాంకు సిబ్బంది, అధికారులు, సంఘాలు, పీఏసీఎస్‌లు సమన్వయంతో పనిచేయాలన్నారు. తద్వారా మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. జిల్లా పీఏసీఎస్ డెవలప్‌మెంట్ మేనేజర్ నరసింహారావు మాట్లాడుతూ పీఏసీఎస్‌లలో కంప్యూటరీకరణకు సిద్ధంగా ఉండాలని సీఈఓలను ఆదేశించారు. పెట్రోలు బంకుల ఏర్పాటుకు అనువైన కార్యాచరణ రూపొందించుకోవాలని సీఈఓలకు సూచించారు. కార్యక్రమంలో కనిగిరి సబ్ డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్ ఎం.కరుణాకర్, అధికారులు పాల్గొన్నారు.

కారు, ట్రాక్టర్ ఢీ
వ్యక్తి మృతి



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు



ప్రమాదానికి కారణమయిన ట్రాక్టర్

పీసీపల్లి: కారు, ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం సాయంత్రం జరిగింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని దివాకరపల్లికి చెందిన చీమలమర్రి వెంకటేశ్వర్లు(40) కందుకూరు నుంచి దివాకరపల్లికి కుటుంబసభ్యులతో కలిసి కారులో వస్తుండగా పీసీపల్లి సమీపంలోని మారెళ్ల వద్ద పెదచెర్లోపల్లి నుంచి కట్టెల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ పక్కభాగం ఢీకొంది. ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయింది. ప్రమాదంలో వెంకటేశ్వర్లు మృతి చెందగా మిగిలిన ముగ్గురు సురక్షితంగా బయటపడ్డారు. సంఘటనాస్థలానికి చేరుకున్న ఎస్సై నాగేశ్వరరావు క్షతగాత్రులను 108లో కనిగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

వీసీగా బాధ్యతలు స్వీకరించిన మారెడ్డి అంజిరెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న వీసీ అంజిరెడ్డి

ఒంగోలు: ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్‌గా ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ జయరామిరెడ్డి వద్ద నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రకాశం జిల్లావాసుల చిరకాల వాంఛ అయిన ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఏర్పాటుతో పాటు దానికి జిల్లా వాసినైన తనకు వైస్ ఛాన్స్‌లర్‌గా అవకాశం కల్పిస్తూ ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. త్వరలోనే ఆచార్య నాగార్జున యూనివర్శిటీ నుంచి ఆంధ్రకేసరి యూనివర్శిటీని విభజించే ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. ప్రస్తుతం పీజీ సెంటర్‌లో ఉన్న ఆర్ట్స్ కోర్సులతో పాటు సైన్స్ , ఇంజినీరింగ్ బేసిక్ కోర్సులు, స్కిల్ బేస్డ్ ట్రైనింగ్ కోర్సులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. యూజీసీ నిబంధనల ప్రకారం ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చే యూనివర్శిటీగా ఆంధ్రకేసరి యూనివర్శిటీలో కోర్సులు ప్రారంభిస్తామని వివరించారు. జిల్లాలో ఉన్న ఆక్వా, గ్రానైట్ వంటి వనరులకు అనుగుణంగా తక్షణమే ఉపాధి అవకాశాలు మెరుగుపడే కోర్సులను ప్రవేశపెట్టాలని భావిస్తున్నామన్నారు. డిగ్రీ, బీఈడీ, పీజీ కోర్సులతోపాటు ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సులను కూడా అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. బాలరిష్టాలను అధిగమించి త్వరలోనే పూర్తిస్థాయిలో యూనివర్శిటీ కార్యక్రమాలు కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అందరి సహకారంతో ఆంధ్రకేసరి యూనివర్శిటీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

బాల్య వివాహాల నిరోధానికి కమిటీలు

- ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మి



మాట్లాడుతున్న పీడీ ధనలక్ష్మి

మార్కాపురం: జిల్లాలో బాల్య వివాహాల నిరోధానికి గ్రామ, మండల జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసినట్లు ఐసీడీఎస్ పీడీ వై.ధనలక్ష్మి చెప్పారు. మార్కాపురంలో ఐసీడీఎస్ కార్యకర్తలు, సూపర్‌వైజర్ల సమావేశానికి శుక్రవారం హాజరయ్యారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ చిన్న వయసులోనే వివాహాలు చేయడం వల్ల శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు పడతారన్నారు. ఈ అంశాలపై విస్తృతంగా గ్రామాల్లో ప్రచారం చేయాలని కార్యకర్తలను ఆదేశించారు. బాల్య వివాహాలు బాలికల అభివృద్ధికి నిరోధకాలన్నారు. చదువుతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. తల్లిదండ్రులు కూడా బాల్య వివాహాలకు స్వస్తి పలకాలన్నారు. అన్ని శాఖల సమన్వయంతో వీటిని నిరోధిస్తామన్నారు. చిన్న వయసులోనే తల్లులైతే అనారోగ్యంతో పాటు మానసిక ఒత్తిడికి గురవుతారన్నారు. మంచి భవిష్యత్‌కు అందరం కలిసి పునాదులు వేయాలని కోరారు. తల్లిబిడ్డల సంరక్షణకు ఐసీడీఎస్ అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. గర్భిణులు, బాలింతలకు పోషక లోపాలను నిరోధించేందుకు ఫుడ్ మెటీరియల్ ఇస్తున్నామన్నారు. గ్రామ స్థాయి నుంచి పథకాల అమలుపై ఫీడ్ బ్యాక్ రిపోర్టు తెప్పించుకుంటున్నామన్నారు. యాక్షన్ ప్లాన్ తయారుచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుల్లలచెరువు ప్రాంతంలో పులి సంచారం





కెమెరాలు ఏర్పాటు చేస్తున్న అధికారులు, గూడెం సమీపంలో గుర్తించిన పులి గుర్తులు

పుల్లలచెరువు: పుల్లలచెరువు మండలంలోని అక్కపాలెం చెంచుగూడెం, తండా పరిసర ప్రాంతాల్లో పులి సంచరిస్తున్నట్లుగా తమ దృష్టికి వచ్చిందని రేంజ్ అధికారి నీలకంఠేశ్వరరెడ్డి తెలిపారు. అక్కపాలెం గూడెంవాసులు ఇచ్చిన సమాచారం మేరకు బట్టిగెనుపు కుంట, భూమని చౌదయ్య పొలాల్లో పులి సంచరిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఆ పరిసర ప్రాంతాల్లో కెమెరా ట్రాప్స్‌ను అమర్చినట్లు చెప్పారు. పరిసర ప్రాంతాల్లో ఉండే ప్రజలు రాత్రిళ్లు బయట తిరగరాదని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కరెంట్ ఫెన్సింగ్ పెట్టవద్దని, రాత్రిళ్లు పొలాలకు విద్యుత్ సరఫరా ఇవ్వవద్దని అధికారులకు తెలియజేస్తామని తెలిపారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పులి సంచారం గురించి సమాచారం తెలిస్తే వెంటనే తెలిజేయాలన్నారు. విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశామని, వారి ఆదేశాలను పాటించి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈయన వెంట డీఆర్‌ఓ రామమోహన్‌రావు, సిబ్బంది ఉన్నారు.

ట్రాక్టర్ తిరగబడి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దుర్మరణం



రావికుంట వాగులో తిరగబడిన ట్రాక్టర్



సాయి కల్పనారెడ్డి (ఫైల్)



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తాళ్లూరు: పొలంలో పనిచేస్తున్న తండ్రికి క్యారేజీ, వ్యవసాయ పనులకు అవసరమైన ట్రాక్టర్ తీసుకు వెళ్తూ ప్రమాదవశాత్తు యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని లక్కవరంలో శుక్రవారం జరిగింది. పోలీసులు, బంధువుల కథనం ప్రకారం..తాళ్లూరు గ్రామానికి చెందిన తూము వెంకట సుబ్బారెడ్డి కుమారుడు సాయి కల్పనారెడ్డి (22) ఇంజినీరింగ్ చదివి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. వారం రోజుల క్రితం ఇంటికి వచ్చాడు. ఉన్నత విద్యనభ్యసించేందుకు గేట్ పరీక్ష రాసేందుకు సిద్ధమవుతున్నాడు. ఈ క్రమంలో పొలంలో పనిచేస్తున్న తండ్రికి క్యారేజీ ఇచ్చేందుకు ఇంటి నుంచి ట్రాక్టర్‌పై బయలుదేరాడు. అయితే రావికుంట వాగు వద్దకు వచ్చేసరికి ట్రాక్టర్‌పై ఉన్న క్యారేజీ పక్కకు వరగటంతో దాన్ని సరిచేసే క్రమంలో ట్రాక్టర్ అదుపు తప్పి రావికుంట వాగులో పడిపోయింది. ప్రమాదంలో ట్రాక్టర్ కిందపడి యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకట సుబ్బారెడ్డికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. చేతికి అంది వచ్చిన కుమారుడు మృతి చెందటంతో తల్లిదండ్రులను ఓదార్చడం ఎవ్వరి వల్ల కాలేదు. ఏఎస్సై సంఘటన స్థలాన్ని పరిశీలించి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్నిపోస్టుమార్టంనిమిత్తం దర్శి సీహెచ్‌సీకి తరలించారు.